## హల్దీ ఎడమ కాల్వ ఆక్రమణపై సర్వే



హల్దీప్రాజెక్టు ఎడమ కాల్వ హద్దులు చూస్తున్న అధికారులు

వెల్దుర్తి, మే 3: మాసాయిపేట మండలంలో హల్దీవాగుపై చిన్ననీటి తరహా ప్రాజెక్టు ఎడమ కాల్వ వెల్దుర్తి శివారులో ఆక్రమణకు గురైంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈఈ రాజేందర్‌రావు, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ శనివారం సిబ్బందితో కలిసి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. హల్దీప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా కొప్పులపల్లి, హస్తాల్‌పూర్, నెల్లూర్, పెద్దాపూర్, శేరీల, వెల్దుర్తి మీదుగా కుకునూర్ వరకు హల్దీ ప్రాజెక్టు నీళ్లు ప్రవహిస్తాయన్నారు. కొంత కాలంగా వెల్దుర్తి శివారులో ఉన్న కాల్వ ఆక్రమణకు గురైంది. దీంతో కాల్వ విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. విషయం తెలుసుకుని కాల్వ ఆక్రమించిన వ్యక్తులకు కొద్ది రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. శనివారం ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి కాల్వ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఎవరైన కాల్వను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పల్లె దవాఖానల్లో వసతులపై నివేదిక పంపిస్తాం

### – రాష్ట్ర క్వాలిటీ మేనేజర్ శ్రీకాంత్



పల్లె దవాఖాన తనిఖీ చేస్తున్న రాష్ట్ర క్వాలిటీ మేనేజర్ శ్రీకాంత్

చిలిపిచెడ్, మే 3: రాష్ట్రంలోని పల్లె దవాఖానలో అన్ని సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు రాష్ట్ర క్వాలిటీ మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం చిలిపిచెడ్, ఫైజాబాద్‌లోని పల్లె దవాఖానలను తనిఖీ చేశారు. దవాఖాన బిల్డింగ్, నీరు, కరెంట్, వసతులు ఏ విధంగా ఉన్నాయని పరిశీలించారు. అన్ని సౌకర్యాలు ఉంటే పల్లె దవాఖానలకు సర్టిఫికెట్‌తో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తారన్నారు. దవాఖానలో సౌకర్యాలు సరిగా లేకపోతే మళ్లీ మూడు నెలల తర్వాత వచ్చి తనిఖీ చేసి నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట డీపీఎం కోట, సూపర్‌వైజర్ రాధాకృష్ణ, డాక్టర్ ప్రతిమ, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి




మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

రామాయంపేట, మే 3: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటలో సీఐటీయూ 15వ మహాసభలు ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రయోజిత పథకాల్లో సుమారు రెండు లక్షల మందికి పైగా స్కీం వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమల్లో 7లక్షల మంది పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలమణి, మల్లేశం ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చేగుంట, మే3: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన చేగుంట పోలీసుస్టేషన్ పరిధి రామంతాపూర్ పంజాబీ దాబా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ జిల్లా కౌడా గ్రామానికి చెందిన ప్రహల్లాద బగ్రియ (39)లారీ డ్రైవర్ తన లారీని దాబాకు సంబంధించిన స్థలంలో పార్కింగ్ చేసి రోడ్డు దాటుతున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ప్రహల్లాద బగ్రియకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రవీందర్‌సింగ్ సంగ్రాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మే 3: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్సింగిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోడ యాదయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడేవాడు. జీవితం మీద విరక్తి చెందిన యాదయ్య శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట, మే 3: ముందు వెళ్తున్న బైక్‌ను తన వాహనంతో ఢీకొట్టి, భయంతో పరిగెడుతూ వంతెనపై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమలాపురం శివారులో ఉన్న 161వ జాతీయ రహదారిపై జరిగింది. ట్రైనీ ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం రాంపూర్‌కు చెందిన బోయిని అనూప్(31) పెద్దశంకరంపేట నుంచి అల్లాదుర్గం వైపు వెళ్తున్నాడు. ముందున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో భయాందోళనకు గురై పారిపోతున్న సమయంలో వంతెనపై నుంచి కింద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట దవాఖానకు తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నిజాంపేట, మే 3: శౌకత్‌పల్లి వడ్డేర కాలనీకి చెందిన ఎల్లవ్వ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, సంగుస్వామి, మల్లేశం ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

# నేడు నీట్

- మెదక్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 487 మంది విద్యార్థులు



మెదక్ మున్సిపాలిటీ: పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మే 3: ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్' పరీక్ష ఆదివారం జరుగనున్నది. పరీక్ష కో సం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్రం ఏ ర్పాటు చేశారు. 487 మంది విద్యార్థులు 'నీట్' పరీక్ష రాయనున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గం టల వరకు జరుగనున్నది. విద్యార్థులు అడ్మిట్ కార్డుతో పా టు ఏదైనా గుర్తింపు కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకెళ్లాలి. పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు ఎస్పీ మహేందర్, నీట్ పరీక్ష కోఆర్డినేటర్ డాక్టర్ హుస్సేన్‌తో కలిసి సందర్శించారు. పరీక్షా గదులు పరిశీలించి, సీసీ కెమెరాలు, జామర్ల పనితీరుని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాసే 487 మంది అభ్యర్థుల్లో 366 మంది మహిళలు, 121 పురుష అభ్యర్థులు ఉన్నారు.

### నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాటు

మెదక్ అర్బన్, మే 3: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించే నీట్ పరీక్షా కేంద్రం వద్ద సెక్షన్ 163 అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రానికి 500 మీటర్ల వరకు గుంపులుగా వుండరాదని సూచించారు. డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు, నిర్వహించరాదని పేర్కొన్నారు.

### కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కొల్చారం, మే 3: మండలంలోని వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లుకు తరలించాలన్నారు. ఇప్పటిదాకా సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ట్యాబ్ ఎంట్రీ చేయాలని, లేదంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐకేపీ, డీసీఎంఎస్, ప్యాక్స్ ఆధ్వర్యంలో 2715 మంది రైతుల నుంచి 53,602 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. దీనికి సంబంధించి రూ.28 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు.



కొల్చారం: ఇందిరమ్మ ఇండ్ల అర్హుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

### ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలి

పేదలకు ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వెంకటాపూర్‌లో కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దరఖాస్తుల పరిశీలనలో పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఇండ్లు అందేలా చూడాలన్నారు. సర్వే వివరాలను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తయ్యాక లబ్ధిదారుల జాబితా పంచాయతీ బోర్డులో ఉంచాలన్నారు. ఎంపికైన వారు ఇండ్లు కట్టేలా అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీవోలు కృష్ణవేణి, ఏపీవో సుశీల్వ, పంచాయతీ సెక్రటరీ సంధ్య, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# వారు నాటారు.. వీరు నరికారు

- దశాబ్దం నాటి చెట్లు నరికివేత
- పట్టించుకోని అధికారులు

పాపన్నపేట, మే 3: బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చి మొక్కలు నాటించింది. ఎవరైనా చెట్లను నరికితే చర్యలు తీసుకున్నది. ఇటీవల కొంతమంది తమ స్వార్థం కోసం రోడ్డుపై ఉన్న చెట్లను నరికినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మెదక్ బొడ్మెట్‌పల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా పెద్ద మామిడి చెట్లు ఉన్నాయి. వీటిని కొంతమంది ఇష్టారీతిలో నరికేస్తున్నారు. ఇదే రహదారిపై లక్ష్మీనగర్ గ్రామ సమీపంలో రైస్‌మిల్, ధర్మకాంట ఉంది. వీటికి ఎదురుగా రహదారి పక్కనే ఆర్‌అండ్‌బీ పరిధిలో మామిడి చెట్లు ఉన్నాయి. ఇవి ఏపుగా పెరగడంతో శుక్రవారం నరికివేశారు. రైస్‌మిల్ యాజమాన్యం పెద్ద చెట్లను నరికేసినా పట్టించుకోలేదు. చెట్లను నారికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



మెదక్, బొడ్మెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఉన్న ధర్మకాంటా వద్ద ఉన్న చెట్లను నరికివేసిన దృశ్యం



మెదక్, బొడ్మెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఉన్న రైస్‌మిల్ వద్ద చెట్లను నరికివేసిన యజమాని

# దళారులకు విక్రయించి మోసపోవద్దు



చేగుంట: వడియారం కొనుగోలు కేంద్రంలో..



రామాయంపేట: పట్టణంలో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తనిఖీ చేస్తున్న తహసీల్దార్

- ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన
- సకాలంలో ధాన్యం తరలించాలి

రామాయంపేట, మే 3: పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, రైస్ మిల్లుల్లో రికార్డులను తహసీల్దార్ రజినీకుమారి శనివారం పరిశీలించారు. పట్టణంలోని కొనుగోలు కేంద్రాల్లో పర్యటించిన తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్నారు. దళారుల చేతిలో మోసాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వర్షాలు వచ్చినప్పుడు జాగ్రత్తలను పాటించాలన్నారు.మండలంలోని ఆయా గ్రామాల్లోని రైసుమిల్లులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ.గౌస్ తదితరులు ఉన్నారు.

### ధాన్యం నిలువ ఉండొద్దు

చేగుంట, మే3: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ లేకుండా లోడ్ చేసి మిల్లర్స్‌కు పంపాలని తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు. వడియారం తదితర కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. ఏఈవోలు మాధవి, వీరేశం ఉన్నారు.

# పాములతో సావాసం చేస్తున్నం..



మాకు కూలిపోయే గుడిసెనే ఉంది.అందరూ వచ్చి చూసింన్రు. మీకు కచ్చితంగా ఇళ్లిత్తమన్నరు. కట్టుకుందామనుకుంటే గిప్పుడు మీకు రాలేదు మల్లొచ్చినప్పుడు చేప్త మంటుండ్రు. వానకాలం అస్తె మాగుడిసె ముందు పాములు వస్తయి. కప్పలైతే వాటి సప్పుడుకు నిద్రకూడా పట్టది. ఎప్పుడు వానొచ్చినా గుడిసె ముందు మొత్తం నీళ్లు ఆగుతాయి. మా గుడిసెలకు రావల్నంటేనే రారాదు. గుడిసె సుట్టూరా నీళ్లే నిలుస్తయ్.

-హరిజన ఎల్లవ్వ-రవి, రామాయంపేట



కోర్టు ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి నీలిమ

# కోర్టు ఏర్పాటుకు భవన పరిశీలన

తూప్రాన్, మే 3: తూప్రాన్‌లో మూడేండ్ల క్రితం జూనియర్ సివిల్ కోర్టు మంజూరైంది. కానీ ఇంతవరకు కోర్టుకు అనుకూలమైన, కనీస సౌకర్యాలున్న బిల్డింగ్ దొరకలేదు. ఎన్నో భవనాలను పరిశీలించిన అనంతరం భవిష్యత్తులో ఇంటిగ్రేటెడ్ కార్యాలయంలోకి ఎలాగో ఎంపీడీవో కార్యాలయాన్ని మార్చక తప్పదని భావించిన అధికారులు, చివరగా కొంతలో కొంత మెరుగ్గా ఉన్న తూప్రాన్ ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రతిపాదించారు. శనివారం తూప్రాన్ విచ్చేసిన మెదక్ జడ్జి నీలిమ ప్రస్తుతమున్న తూప్రాన్ ఆర్డీవో కార్యాలయాన్ని ఫైనల్ చేశారు. 15 రోజుల్లోగా భవనాన్ని స్వాధీ నం చేయాలని అధికారులకు సూచించా రు. కాగా, ప్రస్తుతమున్న ఎంపీడీవో కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌కు షిఫ్ట్ చేసే ఆలోచనలో ఉన్నారు. బిల్లులు చెల్లించని కారణంగా చివరి దశలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు కాంట్రాక్టర్ తాళం వేసుకుని వెళ్లిపోయాడు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయం ప్రారంభమైతే ప్రజల కు అవసరమైన అన్ని సేవలు ఒకే చోట దొరకుతాయి. దీంతో పాటు మిగతా కార్యాలయాలకు స్పేస్ దొరికే అవకాశం ఉంటుంది. తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంతో పాటు, ఇరిగేషన్ కార్యాలయం, ఈఎస్ఐ దవాఖానా, అంగన్‌వాడీ కేం ద్రాలు, చాలా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఏ శాఖ కార్యాలయం ఎక్కడుందో ప్రజలకే కాదు, కొం తమంది అధికారులకు తెలియకపోవడం విచిత్రమే. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి ఇంటిగ్రేటెట్ ఆఫీస్ భవనానికి నిధులు విడుదల చేసి, త్వరగా ఓపెన్ చేస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఆర్డీవో జయ చంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



సమస్యను పరిష్కరిస్తున్న రంగయ్యగారి రాజిరెడ్డి

చేగుంట, మే3: మండలంలోని బీ కొండాపూర్ గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ తాగునీటి పైపులైను పగిలిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు రాజిరెడ్డికి గ్రామస్తులు కోరారు. దీంతో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి దగ్గరుండి పైపులైన్ల మరమ్మతులు చేయించారు. దుబ్బాక నియోజక వర్గంలో వేసవిలో తాగు నీటి సమస్య రాకుండా అధికారులు అన్ని గ్రామాల్లో పర్యటించి, చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచించారని రాజిరెడ్డి తెలిపారు.

### బోరు మోటర్లు అందజేత



సింగిల్ ఫేస్ మోటర్ బిగిస్తున్న నరేశ్‌రావు

కొల్చారం, మే 3: ఓ వ్యాపార వేత్త తన గ్రామస్తుల తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు మూడు బోరు మోటర్లను శనివారం అందజేశారు. మండలంలోని అంసానిపల్లి గ్రామానికి చెందిన నరేశ్‌రావు గ్రామంలో తాగు నీటి సమస్య తెలుసుకుని చలించిపోయాడు. గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు మూడు బోరు మోటర్లు ఇప్పించారు. గ్రామంలోని వీరభద్ర ఆలయానికి రూ.రెండు లక్షల 16 వేలు విరాళం అందించాడు. రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదుట గజ స్తంభం ఏర్పాటుకు ఆర్థిక సయం అందించారు.

## కోనాపూర్ శివారులో చిరుత సంచారం

రామాయంపేట రూరల్, మే 3: కోనాపూర్ శి వారులో చిరుత సంచారం భయాందోళనకు గురిచేస్తున్నది. వాటర్‌మెన్ శనివారం తెల్లవారుజామున నల్లానీరు వదలడానికి వెళ్తుండగా చిరుత కనిపించిందని తెలిపాడు. అప్రమత్తమైన గ్రామస్తులు విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిపారు. వెంటనే రేంజ్ అధికారి మురళీధర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ఆనవాళ్లు సేకరించారు. కోనాపూర్ శివారులో చిరుత సంచరించినట్లు ఆనవాళ్లు లభించలేదని, రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని ఆయన సూచించారు. చిరుత కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గస్తీ నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అధ్యక్షుడిగా రాజు



తొడుపునూరి రాజును సన్మానిస్తున్న పరంజ్యోతి

చేగుంట,మే03:మూడవ సారి మెదక్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అధ్యక్షుడుగా ఎన్నికైన తొడుపునూరి రాజును జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయిత పరంజ్యోతి పాటు పలువురు మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.రాజు ప్రస్తుతం మెదక్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అధ్యక్షుడితో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నారు.మెదక్‌లో జరిగిన మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడుగా రాజు మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.ఈ కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్,మెడికల్ అసోసియేషన్ సభ్యులు అయిత రఘురాములు,కాశబోయిన సుధాకర్ తదితరులున్నారు.

## ఇంటి తాళాలు పగుల కొట్టి చోరీ

కౌడిపల్లి, మే 3: ఇంటి తాళాలు పగుల కొట్టి నగదు అపహరించిన ఘటన మండలంలోని దేవులపల్లి పంచాయతీ పరిధిలోని కోమటికుంటతండాలో జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గూగ్లోత్ రమేశ్ గత నెల 24న ఇంటకి తాళం వేసి బంధువుల పెండ్లికి వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు పలగుల గొట్టి ఉన్నాయి. 15 రోజుల క్రితం అప్పు కట్టేందుకు తెచ్చిన రూ.80 వేలను బీరువాలో దాచి ఉంచాడు. కాగా ఆ డబ్బును గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నామని ఎసై తెలిపారు.

# హోటళ్లు, బేకరీలపై మున్సిపల్ అధికారుల దాడులు



బేకరీలో ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్

- పలువురికి జరిమానా విధించిన అధికారులు



యాజమానికి జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, మే 3: మెదక్ పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌లలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గల హోటళ్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. హోటళ్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌ల నిర్వాహకులు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిల్వ చేసిన, కుళ్లిన ఆహార పదార్థాలు ఉంచరాదని, ఏ రోజు తినుబండారాలు ఆ రోజే తయారు చేసి విక్రయించాలన్నారు. ఆహార పదార్థాలపై దుమ్ముధూళి పడకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. హోటళ్లను శుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి హోటల్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంట మున్సిపల్ పారిశుధ్య జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

# సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ/కౌడిపల్లి/ వెల్దుర్తి/పెద్దశంకరంపేట, మే 3: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ న్యూ హైస్కూల్‌లో వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంఈవో శంకర్ శనివారం ప్రారంభించారు. 15 రోజుల పాటు నిర్వహించే శిబిరంలో యోగా, కంప్యూటర్, డ్రాయింగ్‌లో శిక్షణనిర్వనున్నట్లు తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోలవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మిప్రసన్న, అస్మా షాహిన్, అక్బర్ అలీ, బాలకృష్ణ, రామకృష్ణ, వీరేశం, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ గీత, డ్రాయింగ్ టీచర్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

### కౌడిపల్లిలో..

యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బాల్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. హాజరైన విద్యార్థులకు అవగాహణ కల్పించారు. టీచర్లు రెడ్డి,జ్ఞాన ప్రకాష్,కృష్ణ కో ఆర్డిటర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈవో బాల్‌రాజు

### వెల్దుర్తిలో..

వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి 20 వరకు పెయింటింగ్, డ్యాన్స్, చేతిరాత, యోగా నేర్పిస్తారన్నారు.



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న ఎంఈవో

### పెద్దశంకరంపేట:

వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజయ్‌కుమార్, సత్యకుమార్, సిద్ధిరాములు, సుధీర్, తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, RAMAGONI RAJU GOUD, S/o. Ramagoni Narsaiah Goud, R/o. H.No. 1-110/4/M/321, M.A. Nagar, Miyapur Serilingampally (M), R.R.Dist, Hyderabad, T.G. In my Aadhar & PAN Card my name is spelled as RAMAGONI RAJU GOUD, S/o. RAMAGONI NARSAIAH GOUD. In my Passport my name is wrongly spelled as RAMAGONI RAJU, S/o. RAMAGONI NARSAIAH. Both names belong to me only. Have changed my name as RAMAGONI RAJU GOUD S/o. RAMAGONI NARSAIAH GOUD for all record purposes

LOST
I, G.Durga Devi, W/o. Ramulu Goud, R/o. Krishnanagar Colony, Beeramguda, Hyderabad, T.G. I was shifting House and misplaced / Lost my house Link Document vide Sale deed No. 2872/2012. While travelling from Madhura Nagar Colony to Krishna Nagar Colony, Beeramguda on 10.04.2025. If Anybody Found Please Contact:
8185043091

LONG TERM COACHING
★BiPC-NEET & MPC-IIT Long Term Coaching Start on June 1st. Sri Chaitanya Jr. College, Hyd. Contact: K.Ashok Reddy, A.O., Cell: 9441884705.
NT-MBNR

FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.